## క్లుప్తంగా

### చిలమత్తూరులో మోస్తరు వర్షం

**చిలమత్తూరు:** మండలంలో శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా వాతవరణంలో మార్పులు చోటు చేసుకోగా రాత్రి సమయాల్లో వర్షం కురుస్తోంది. శనివారం 6.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ భార్గవి తెలిపారు.

### శ్మశాన వాటికలో శుభ్రత పనులు



శుభ్రత పనులు చేస్తున్న దృశ్యం

**హిందూపురం:** పట్టణంలోని 13వ వార్డు సడ్లపల్లిలోని శ్మశాన వాటికలో ఆదివారం వార్డు కౌన్సిలర్ సునీత వెంకటేష్ ఆధ్వర్యంలో శుభ్రత పనులు చేపట్టారు. ఉగాది, శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రజలు పెద్దల సమాధుల సందర్శన పూజలు చేయడానికి వీలుగా శ్మశాన వాటికలో పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు ప్రజలు రాకపోకలకు వీలుగా గుంతలు పూడ్చారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**అమరాపురం:** స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో అమరాపురం ఆరోగ్యమైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి వచ్చిన గైనకాలజిస్ట్ జ్యోతివిజయకుమార్ 150 మంది పరీక్షించి రూ.30 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. అలాగే బెంగళూరు నుంచి వచ్చిన దంత వైద్య నిపుణుడు నాగేంద్రకుమార్ 75 మంది రోగులను పరీక్షించి సూచనలు, సలహాలివ్వడంతో పాటు అవసరమైన మందులను అందజేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**పెనుకొండ రూరల్:** ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలమేరకు.. బ్రాహ్మనపల్లికి చెందిన శామీర్ అనే వ్యక్తి పాల కేంద్రం నిర్వహించేందుకు గుట్టూరు వెళ్తున్నారు. మార్గమధ్యలో గోనిపేట రహదారి వద్ద బైక్ అదుపు తప్పింది. గాయపడిన శామీర్‌ను హిందూపురం తరలించారు.

### యూటీఎఫ్ ప్రథమ కౌన్సిల్ సమావేశం



ప్రతిజ్ఞ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**పెనుకొండ:** పట్టణంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాష్ట్ర యూటీఎఫ్ కార్యదర్శి అశ్వర్థప్ప తదితరులు హాజరయ్యారు. సమావేశంలో గేయానంద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పుడూ శాస్త్రీయ దృక్పథంతో పాటు ప్రజా జీవనం, లౌకిక దృష్టితో వ్యవహరించాలన్నారు. నాయకులు సుధాకర్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు.

### ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**గోరంట్ల:** మండల పరిధిలోని కరావులపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో దాదాపు రూ.50 లక్షల వ్యయంతో కరావులీశ్వర దేవాలయ నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగానే బెంగళూరులో స్థిరపడిన రిటైర్డు కండక్టర్ వాసుదేవరెడ్డి ఆదివారం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ప్రకటించిన మొత్తంలో రూ.50 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేవారు.

# ఉచిత వైద్యంతో ఆదర్శం

- సొంత ఊరి రుణం తీర్చుకుంటున్న డాక్టర్ దినకర్
- వైద్యసేవలతో పాటు మందుల పంపిణీ

జన్మనిచ్చిన తల్లినే మరచిపోతున్న ఈ రోజుల్లో పుట్టి , పెరిగి విద్యాబుద్ధులు నేర్చుకొని ఒక స్థాయికి వచ్చినా సొంత ఊరి రుణం తీర్చుకోవాలన్న దృఢ సంకల్పంతో తాను పుట్టిన ఊళ్లో ఉచిత వైద్యసేవలకు శ్రీకారం చుట్టారు డాక్టర్ దినకర్. వృత్తి రీత్యా ఆయన అనంతపురం జిల్లా కేంద్రంలో ఉన్నా ప్రతి నెలా రెండో ఆదివారం మాత్రం కచ్చితంగా అమరాపురం గ్రామానికి వెళ్తుంటారు. అప్పుడే పుట్టిన పురిటి బిడ్డ నుంచి వివిధ జబ్బులతో బాధపడుతున్న చిన్నారుల వైద్యానికి భరోసా ఇస్తూ అందరి మన్ననలనూ పొందుతున్నారు.

**అమరాపురం:** మడకశిర నియోజకవర్గం అమరాపురం గ్రామానికి చెందిన నరసింహప్ప, పార్వతమ్మ కుమారుడు దినకర్ ప్రభుత్వ వైద్యుడు. అనంతపురం జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిలో పురిటి, చిన్న పిల్లల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. దినకర్ తండ్రి నరసింహప్ప కూడా వైద్యుడే. ఎంబీబీఎస్ పూర్తి చేసి అమరాపురంలో వైద్యుడిగా సేవలందించి కాలం చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా దినకర్ కూడా బాగా చదువుకొని వైద్యుడయ్యారు. వృత్తి రీత్యా అనంతపురంలో స్థిర పడినా ఆయన సొంత గ్రామం అమరాపురానికి మాత్రం ఏదోలా సేవ చేసి రుణం తీర్చుకోవాలనుకున్నారు. ముందు అమరాపురానికి ఏవైనా శుభ కార్యాలకు వచ్చి వెళ్లేవారు. ఇక్కడ వచ్చే రోగులకు అప్పుడప్పుడు దినకర్ ఉచితంగా వైద్య సేవలు అందించే వారు.

**ప్రతి నెలా రెండో ఆదివారం**

తన తండ్రి కలలు సాకారం చేయాలని భావించిన డాక్టర్ దినకర్ తన స్నేహితులు, కుటుంబ సభ్యులతో చర్చించిన తరువాత అమరాపురం గ్రామానికి సేవ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే 2021 సంవత్సరం నుంచి ఉచిత వైద్యసేవలకు శ్రీకారం చుట్టారు. ప్రతి నెలా రెండో ఆదివారం క్రమం తప్పకుండా పురిటి, చిన్న పిల్లలకు వైద్య సేవలు చేస్తూ వస్తున్నారు. చిన్నారులను పరీక్షించడంతో పాటు వారికి అవసరమయ్యే మందులను కూడా ఆయన ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు.



బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ దినకర్ (ఫైల్)

**పక్క ఊళ్ల నుంచి కూడా ...**

దినకర్ వైద్యసేవలు అందరికీ తెలియడంతో ప్రతి నెలా రెండో ఆదివారం చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. ఇప్పటిదాకా దాదాపుగా 5 వేల మందికి పైగా చిన్నారులను వైద్యసేవలు అందించడంతో పాటు మందులు కూడా పంపిణీ చేశారు. తమ బిడ్డల ఆరోగ్యానికి దినకర్ భరోసా ఇస్తుండటంపై అమరాపురం ప్రజలే కాదు చుట్టుపక్కన ఊళ్ల జనం కూడా ఆయన సేవలను కొనియాడుతున్నారు.

**పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనే..**



పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలన్న దృఢ సంకల్పంతోనే ప్రతి నెలా రెండో ఆదివారం అమరాపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నాను. జన్మనిచ్చిన ఊరికి సేవ చేసే భాగ్యం తనకు దేవుడు కల్పించాడు. ఇది నా అదృష్టంగా భావిస్తా. మా నాన్న దివంగత డాక్టర్ నరసింహప్ప కలలను సాకారం చేస్తా. నాకు చాలా సంతృప్తిగా ఉంది. మందులను ఉచితంగా అందిస్తున్నా. ప్రతి నెల 200 మందికి పైగా రోగులు వస్తున్నారు. మా అమ్మ, చెల్లి సహకారం చాలా గొప్పది.

\- దినకర్, చిన్న పిల్లల వైద్యులు

**ఉచిత సేవలు హర్షణీయం**



మా ఊరికి నెలకోసారి వచ్చి దినకర్ డాక్టర్ ఉచిత వైద్య సేవలు అందిస్తుండటం హర్షణీయం. మా గ్రామంలోనే కాదు పక్కనున్న ఊళ్లల్లో ఉన్న వారికి కూడా ఆయన ఎంతో మేలు చేస్తున్నారు. చిన్నారులను పరీక్షించడంతో పాటు మందులు అందిస్తుండటం మా అదృష్టంగా భావిస్తున్నాం. రవాణా ఖర్చులతో పాటు వైద్య ఖర్చులు పూర్తిగా మిగులుతున్నాయి.

\- మణికంఠ, అమరాపురం

## 'నైతిక విజయం రవీంద్రారెడ్డిదే'

**మడకశిర:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతులో పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డిదే నైతిక విజయమని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని తెలిపారు. ఆమె ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పట్టభద్రులు వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని, అయితే కౌంటింగ్‌లో టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడి అనైతిక విజయం సాధించారని విమర్శించారు. టీడీపీ నాయకులతో కౌంటింగ్ సిబ్బంది కుమ్మక్కై ఫలితాన్ని తారుమారు చేశారని ధ్వజ మెత్తారు. కౌంటింగ్‌లో జరిగిన అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ ఓటమిపై కుంగిపోవద్దన్నారు. పట్టభద్రులు, ప్రజలు వైఎస్ జగన్ వైపే ఉన్నారని స్పష్టం చేశారు.

## తనిఖీ బృందానికి సహకరించండి

**రొళ్ల:** మండలంలో వివిధ గ్రామాల్లో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ బృందానికి కూలీలు, రైతులు సహకరించాలని ఆదివారం ఎంపీడీఓ రామారావు కోరారు. ఇది వరకే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు ఉపాధి పథకం ద్వారా చేపట్టిన 801 పనులకు గాను రూ.6.97 కోట్లు ఖర్చు పెట్టిన వివరాలతో కూడిన రికార్డులను డీఆర్పీలు, వీఎస్ఏలకు అప్పగించామన్నారు. పంచాయతీరాజ్ , పట్టు పరిశ్రమ, సర్వశిక్ష అభియాన్, ఫారెస్ట్, పశువైద్య శాఖ తరుపున చేపట్టిన పనులకు సంబంధించి ఖర్చు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. తనిఖీ బృందం వారికి పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. తనిఖీలో వెల్లడైన అంశాలను ఈనెల 28న ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో బహిరంగ సభ ద్వారా చదివినిపించడం జరుగుతుందన్నారు.

## మద్యం విక్రేతల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

**రొద్దం:** మండలంలోని కోగిర గ్రామంలో ఆదివారం కర్ణాకట మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. గోవిందు, మల్లికార్జున అనే ఇద్దరి నుంచి 40 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## జూదరుల అరెస్టు

**హిందూపురం:** మండల పరిధిలోని చిన్నగుడ్డంపల్లి వద్ద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.8,430 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. చిన్నగుడ్డంపల్లి వద్ద గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడిచేసి జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

## క్రీడాకారుల ఎంపిక



ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు

**పెనుకొండ:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 'స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ ఫెడరేషన్ ఇండియా' ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు రామచంద్ర తెలిపారు. ఇందులో దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో జిల్లా స్థాయిలో అనంతపురంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, కబాడ్డీ, రన్నింగ్, లాంగ్‌జంప్. హైజంప్, చెస్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## అడవులను సంరక్షిస్తేనే మనుగడ

**రొద్దం:** ప్రతి పౌరుడు అడవులను సంరక్షిస్తేనే రాబోవు తరాలకు మనుగడ ఉంటుందని చిగురు కోఆర్డినేటర్ రామన్న అన్నారు. టింబక్టు-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన చిగురు, కల్పవల్లి ఆధ్వర్యంలో మండలంలోని శ్యాపురం కల్పవల్లి అటవీలో ఆదివారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిగురు కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అడువులను కాపాడాలన్నారు. అడవులను పరిక్షించడం, పెంపకం, ప్రకృతి పర్యావరణంపై అవగాహన కల్పించారు. వాటర్ షేడ్, ఆహార గొలుసు, వాతావరణంలో మార్పులు, అడవుల సంరక్షణ, గడ్డి భూములు, అడవులకు నిప్పుపెడితే జరిగే అనర్థాలు తదితర



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నమూనాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్పవల్లి సీఈఓ చిరంజీవి, రమేష్, అధ్యక్షుడు నాగరాజు, సిబ్బంది, చిగురు బాలల సంఘం చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. అపార నష్టం

**పెనుకొండ రూరల్:** మండలంలోని దుద్దేబండ, మునిమడుగు, గొల్లపల్లి, కురుబవాండ్లపల్లి, గుట్టూరులో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ పరిశీలించారు. 131 మంది రైతులకు సంబంధించిన 289 ఎకరాల మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. సోమవారం నుంచి రైతు భరోసా కేంద్ర సిబ్బంది నష్టపోయిన రైతు పొలాలను సందర్శించి పూర్తిస్థాయి నివేదికను తయారు చెయ్యాలని, అలాగే నష్టపోయిన రైతులు సంబంధిత ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

**పెనుకొండ రూరల్:** మండలంలోని మునిమడుగు, వెంకటగిపాళ్యం, గొందిపల్లి గ్రామాలలో శనివారం రాత్రి వడగండ్ల వర్షం కురిసింది. దీంతో మామిడి, కర్బూజ, టమాట, కళింగర, దోస వంటి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా టమాట 23 ఎకరాలు, , దోస 14 ఎకరాలు, అరటి 8 ఎకరాలు , బొప్పాయి 8 ఎకరాలు, మామిడి 3 ఎకరాలు దాదాపుగా 70 ఎకరాల్లో పంటలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని, నష్టపోయిన రైతులు సంబంధిత ఆర్బీకేల్లో సంప్రదించాలని ఉద్యానశాఖ అధికారి రాంప్రసాద్ తెలిపారు.



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

## చెస్ క్రీడాకారుల ఎంపిక

**పెనుకొండ:** పట్టణంలోని ప్రగతి గ్లోబల్‌జెన్ పాఠశాలలో ఆదివారం చెస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా చెస్ అడహక్ కమిటీ కన్వీనర్ నాగార్జున తెలిపారు. జిల్లా అండర్ -19 ఓపెన్ విభాగంలో నిఖిలేంద్ర, వేణుతేజ, నిశ్చింత్ సందేశ్, జైకృష్ణ , బాలికల విభాగంలో జ్ఞాపికరెడ్డి, పూర్ణమ్మ, హరిణి సాయి, మధుశ్రీ ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్రస్థాయి అండర్ 19 పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు.

## 23న జ్యోతుల మహోత్సవం

**సోమందేపల్లి:** తొగటవీర క్షత్రియ ఆరాధ్య దైవమైన చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ డీ.సీ ఈశ్వరయ్య తెలిపారు. ప్రతి ఏడాది తరహాలోనే ఉగాది పండుగ సందర్భంగా జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే పాతఊరులోని చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొనాలన్నారు.

## విశిష్ట సేవలందించిన వారికి జ్ఞాపికలు

**మడకశిర:** పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అదే విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో విశిష్ట సేవలందించిన పలువురిని సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు జన్మదినం సందర్భంతో పాటు ఆయన తండ్రి రామాంజనేయులు జ్ఞాపకార్థం ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 45 మంది ఈశిబిరంలో రక్తదానం చేశారు.

## ఆ ఘోరానికి ఏడాది

- పావగడ వద్ద ప్రైవేటు బస్సు బోల్తా ఘటనలో ఏడుగురు విద్యార్థుల మృత్యువాత
- ఇప్పటికీ కోలుకోని క్షతగాత్రులు

**పావగడ:** పావగడ చరిత్ర లోనే మరచి పోలేని దుర్దినం. ఇంకో అర్ధగంట లో పరీక్షా కేంద్రాలకు వెళ్ళి పరీక్షలు రాయాల్సిన 7 మంది విద్యార్థులు విలువైన ప్రాణాలు గాల్లో కలసి పోయాయి. మరికొందరు విద్యార్థులు తీవ్ర గాయాల పాలై ఇప్పటికీ కోలుకోలేక జీవచ్ఛవాలుగా బతుకీడాల్సి వచ్చింది. ప్రైవేటు బస్సు యజమానుల దురాశకు అమాయకులు బలయ్యారు.

**పరీక్ష రాయడానికి వస్తూ**

గత ఏడాది మార్చి 19వ తేదీన ఉదయం సుమారు 11 గంటల సమయంలో వైఎన్ హొసకోట నుంచి ఓ ప్రైవేట్ బస్సు క్రిక్కిరిసిన ప్రయాణికులు, పైగా టాప్ మీద కూడా నిండుగా పావగడ కు వస్తున్న బస్సు పళవల్లి చెరువు కట్ట మీద అతి వేగం వల్ల పల్టీలు కొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న పీయూ విద్యార్థులు అజిత్, షానవాజ్, కళ్యాణ్, హర్షిక, దాదా వలీ, అమూల్య, మహేంద్ర తీవ్ర గాయాల పాలై ఇద్దరు సంఘటనా స్థలం లోనే మృతి చెందగా మిగిలిన 5 మంది క్షతగాత్రులు వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతూ కొన్ని రోజుల వ్యవధిలో కన్నుమూశారు. గాయాల పాలైన పలువురు విద్యార్థులు అంగ వైకల్యంతో బాధ పడుతున్నారు. ఇంతటి ఘోర ప్రమాదానికి కారణమైన ఆ పళవల్లి చెరువు కట్ట మీద ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడం గమనార్హం. బాధిత కుటుంబాలకు సైతం అరకొర సాయమే అందింది. ఆనాటి ఘోరాన్ని తలుచుకుని బాధిత కుటుంబాలు కన్నీరు మున్నీరయ్యాయి.



ఆనాటి బస్సు ప్రమాద దుర్ఘటన( ఫైల్)

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

**హిందూపురం టౌన్:** అనాథ మృతదేహానికి స్వచ్ఛంధ సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం మృతిచెందిన అనాథ యాచకురాలు మృతదేహం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి ఆచూకీ కోసం రూరల్ సర్కిల్ సీఐ వేణుగోపాల్, లేపాక్షి ఎస్ఐ మునీర్ అహమ్మద్‌లు విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో అంత్యక్రియలకు స్వచ్ఛంధ సంస్థ సభ్యులకు తెలియజేశారు. ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్, సల్తనత్, ఏ ఖుదాదాత్ అధ్యక్షుడు అతీఖ్ ఉర్ రెహమాన్ సంయుక్తంగా పట్టణంలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలను పూర్తి చేశారు.



మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

## దళితుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**మడకశిర:** వైఎస్సార్‌సీపీ హయాంలోనే దళితులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని దళితుల సమస్యలపై చర్చించారు. నరసింహులు విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అన్ని పదవుల్లో దళితులకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, నియోజకవర్గంలోని దళితులు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. వైస్ ఎంపీపీ మూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, కౌన్సిలర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులును సన్మానిస్తున్న దృశ్యం

## ఆనందం.. ఆహ్లాదం



ఇందిరా పార్కులో చిన్నారుల సందడి

- చిన్నారులకు ఆట వస్తువులు
- పెద్దలకు వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- సందడిగా మారుతున్న పార్కులు

**హిందూపురం:** ఉరుకులు, పరుగులతో సాగిపోతున్న నేటి కాలంలో కుటుంబంతో కలిసి వినోదం, ఆహ్లాదం పొందటానికి పార్కులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం ప్రజలకు ఆహ్లాదంతో పాటు వ్యాయామం చేసుకునేలా వసతులు కల్పించడంతో పార్కులు సందడిగా మారుతున్నాయి.

**పిల్లలు.. పెద్దలకు అనుకూలంగా...**

పట్టణంలోని ఇందిరాపార్కు , డీబీ కాలనీలో ఎన్‌జీఓ కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. ఎన్‌జీఓ కాలనీలో గత టీడీపీ పాలనలో రూ.55 లక్షలు ఖర్చుచేసి కేవలం శిలా ఫలకం, ప్రహరీ నిర్మించి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 10 వార్డు కౌన్సిలర్ పార్వతి చొరవ చూపి పార్కు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.25 లక్షల దాకా వ్యయం చేసి పార్కు మొత్తం శుభ్రం చేసి పెద్దల కోసం వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలుతో పాటు పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు ఏర్పాటు చేయించారు. దీంతో పార్కు ఎంతో ఆహ్లాదంగా మారింది. అలాగే ఇందిరాపార్కులో కూడా కొత్తగా వ్యాయమ పరికరాలను ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకోవడానికి వీలు ఉయ్యాలలు, జారే బండ, ల్యాడర్ ఇతర పరికరాలన్నీ మరమ్మతు చేయించడంతో పిల్లలు, పెద్దలతో పార్క్ కిటకిటలాడుతోంది.



ఎన్‌జీఓ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తున్న దృశ్యం

**ఆరోగ్యానికి మేలు**



ఇంట్లో పిల్లలు సమయం దొరికిందంటే చాలు టీవీ, సెల్‌ఫోన్ ఆటలతో మునిగిపోతారు. దీనివల్ల వారి ఆరోగ్యం పాడవుతోంది. అందుకే సాయంత్రం వేళల్లో నేను మా పిల్లలతో పార్కుకు వచ్చేస్తాం. పార్కులో నేను వ్యాయమ పరికరాలతో జిమ్ చేస్తుంటే... వాళ్లు ఆడుకుంటూ ఆరోగ్యంగా ఉంటున్నారు.

\- అనూషా, హిందూపురం

**పిల్లలకు కాలక్షేపం**



గతంలో పార్కు ఏర్పాటు చేశారేగానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఇటీవల పార్కును చేయిండంతో పాటు ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం పూట పిల్లలు ఆడుకోవడానికి అనుకులంగా చేశారు. పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పాటు పెద్దలకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో అందరికీ ప్రయోజనం కలుగుతోంది. - ప్రియగౌడ్, హిందూపురం

## మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి

**సోమందేపల్లి:** దివంగత సీపీఎం కేంద్రం కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం మహిళల హక్కుల సాధన కోసం కృషి చేశారని ఐద్వా మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు దిల్షద్ పేర్కొన్నారు. ఆదివారం సోమందేపల్లిలో మల్లు జ్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి, స్థానిక నాయకులు వరలక్ష్మి, శివమ్మ, గంగమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.